సాక్షి కర్నూలు

గురువారం। 10। ఆగస్టు। 2023



శిఖరం చేరిన కృష్ణమ్మ

కొత్తపల్లి: సంగమేశ్వరాలయం పూర్తిగా జలాధివాసం కానుంది. ఇప్పటికే శ్రీశైలం బ్యాక్ వాటర్ క్షేత్ర శిఖరాన్ని చేరాయి. బుధవారం శ్రీశైలడ్యాం నీటిమట్టం 864.5 అడుగులకు చేరుకుంది.



నిలిచిన ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచి పోయింది. డ్యాంలో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తాగునీటి అవసరాల కోసం కేసీ కెనాల్‌కు 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,628.47
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:88.430
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:23,793
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,498

న్యూస్‌రీల్

12 వరకు చిన్నారులందరికీ టీకాలు



వెల్దుర్తిలో విటమిన్ ఏ, ఐరన్ సిరప్ అందిస్తున్న డీఐఓ ప్రవీణ్‌కుమార్

వెల్దుర్తి: మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీ వరకు చిన్నారులందరికీ ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి (డీఐఓ) డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గర్భిణులకు, ఐదేళ్లలోపు పిల్లలకు సమయానుసారంగా టీకాలు ఇవ్వకపోతే.. ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్యక్రమంలో వేయించాలన్నారు. చెరుకులపాడు, వెల్దుర్తి-7 అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. మిషన్ ఇంద్రధనుష్ రెండో విడత సెప్టెంబర్, మూడో విడత అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట వైద్యాధికారులు డాక్టర్ నవీన్, డాక్టర్ వరప్రసాద్, జిల్లా కమ్యూనిటీ మొబలైజర్ ప్రసాద్ ఉన్నారు.

2.51 లక్షల హెక్టార్లకు చేరిన సాగు

కర్నూలు(అగ్రికల్చర్): ఇటీవల జిల్లా వ్యాప్తంగా వర్షాలు ఆశాజనకంగా కురవడంతో సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. జూలై 31 నాటికి సాగు విస్తీర్ణం 1.87 లక్షల హెక్టార్లు ఉంది. ఖరీఫ్ సాధారణ సాగు 4.21 లక్షల హెక్టార్లు ఉండగా.. ఈ నెల 8 నాటికి సాగు విస్తీర్ణం 2,51,983 హెక్టార్లకు పెరిగింది. గత ఏడాది ఇదే సమయానికి 2.72 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇప్పటి వరకు పంటల సాగు 60 శాతం పూర్తయింది. అత్యధికంగా పత్తి సాగులోకి రావడం విశేషం. పత్తి సాధారణ సాగు 2.50 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 1,43,724 హెక్టార్లలో సాగయింది. వచ్చే వారానికి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

డిజిటల్ విద్యను అందించేందుకే కంప్యూటర్లు



కంప్యూటర్‌లను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

కోసిగి: పేద విద్యార్థులకు డిటిల్ విద్యను అందించేందుకే ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్రప్రభుత్వం కంప్యూటర్లు అందజేస్తోందని సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. కోసిగి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలలకు కేటాయించిన కంప్యూటర్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం కోసిగి ఎమ్మార్సీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. డిజిటల్ విద్యా విధానాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఎంఈవో నాగేషప్పను ఆదేశించారు.

'ఇన్‌స్పైర్' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి వి. రంగారెడ్డి తెలిపారు. ఆదోని డివిజన్‌లోని సైన్సు ఉపాధ్యాయులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం ఆదోనిలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనక్ వెబ్ సైట్‌లోకి వెళ్లి ఉన్నత పాఠశాలలు 5, ప్రాథమికోన్నత పాఠశాలలు 3 ప్రాజెక్టులను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఇన్‌స్పైర్ అవార్డులకు సంబంధించిన పోస్టర్‌ను విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్సు అధికారిణి రంగమ్మ, రిసోస్ పర్సన్స్ ఆదిమూర్తి, ఉస్మాన్, పుల్లంరాజు, బేగ్, అమానుల్లా పాల్గొన్నారు.

డీ ఫార్మసీలో ప్రవేశానికి నేటి నుంచి రిజిస్ట్రేషన్

కర్నూలు సిటీ: డిప్లమా ఇన్ ఫార్మసీ-2023లో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి https://apsbtet.in/pharmacy అనే వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జి.పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ఫొటో, సంతకం, పేరేంట్/గార్డియన్ సంతకం, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఇంటర్/ఓపెన్ స్కూల్/ఏదైన సమానమైన సర్టిఫికెట్, ఇంటర్ మార్కుల మెమోలు (ఎంపీసీ/బైపీసీ) అవసరం అవుతాయని పేర్కొన్నారు.

మిర్చి పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది గుంటూరు. అలాంటిది నేడు ఆ ప్రాంతాన్ని మించి కర్నూలు జిల్లాలో మిర్చి సాగవుతోంది. ఈ ఎర్ర బంగారం రైతులకు కాసుల పంట పండిస్తోంది. ఇక్కడ సాగవుతున్న మిర్చి విదేశాలకు సైతం ఎగుమతి అవుతుండటం రైతుల్లో ఉత్సాహం నింపుతోంది. అధిక శాతం రైతులు రసాయనాల వాడకం తగ్గించడం, సూక్ష్మ సేద్యంతో పంట సాగు చేస్తుండటం వల్ల మేలైన దిగుబడులు రావడంతో పాటు ధర కూడా ఘాటెక్కుతోంది.



కల్లంలో ఆరబోసిన మిర్చి (ఫైల్)

'ఘాటెక్కిన' పంట!

విదేశాలకు కర్నూలు మిర్చి

- గుంటూరుకు దీటుగా పంట సాగు
- గత ఏడాది రికార్డు స్థాయిలో 1.28 లక్షల ఎకరాల్లో పంట
- రికార్డు స్థాయిలో క్వింటాకు రూ.53 వేల ధర
- సూక్ష్మ సేద్యంతో మేలైన దిగుబడులు



సూక్ష్మ సేద్యం కింద సాగయిన మిర్చి

గత ఏడాది రూ.53 వేలతో విక్రయం



2022–23 ఖరీఫ్‌లో రెండు ఎకరాల్లో మిర్చిసాగు చేశాం.ఎకరాకు రూ.2 లక్షల పెట్టుబడి పెట్టగా, దిగుబడి ఎకరాకు 36 క్వింటాళ్లకు పైగా వచ్చింది. మిర్చి పంటను గుంటూరు యార్డులో రూ.30వేల నుంచి రూ.53 వేల వరకు ధరలతో విక్రయించాం. గత ఏడాది 12 క్వింటాళ్ల మిర్చికి క్వింటా రూ.53 వేల చొప్పున ధర లభించింది.ఈసారి మరింత ఉత్సాహంతో 6 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నా. – ఆనంద్, మిర్చి రైతు, సూగూరు గ్రామం, మంత్రాలయం మండలం

కర్నూలు(అగ్రికల్చర్): గత ఏడాది మిర్చికి రికార్డు స్థాయి ధరలు లభించడం, దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది రైతుల్లో మరింత ఉత్సాహం కనిపిస్తోంది. విదేశాలకు ఎగుమతులు పెరుగుతుండటంతో ఈ సారి మిర్చి సాగు అధికం కానుంది. మిర్చి సాధారణ సాగు 50,395 ఎకరాలు ఉండగా ఈ-క్రాప్ ప్రకారం గత ఏడాది జిల్లాలో 65,913 మంది రైతులు 128108.7 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గత ఏడాది 2,12,152 ఎకరాల్లో మిర్చి సాగయింది. అయితే ఒక్క కర్నూలు జిల్లాలోనే 1.28 లక్షల ఎకరాల్లో సాగు కావడం విశేషం. ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల ప్రకారం ఎండుమిర్చి దిగుబడులు దాదాపు 32 లక్షల క్వింటాళ్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మిర్చి సాగు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. ఈ సారి జిల్లాలో మిర్చి సాగు దాదాపు 1.50 లక్షల ఎకరాలకు చేరే అవకాశం ఉన్నట్లు ఉద్యాన శాఖ అంచనా వేసింది.

బ్యాడిగ రకాలకు పెరుగుతున్న డిమాండ్

మిర్చిలో అనేక రకాల విత్తనాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ సింజెంటా 2043 రకానికి(బ్యాడిగ) ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ రకం మిర్చి ఎర్రగా ఆకర్షణీయంగా నిగనిగలాడుతుంటుంది. ఆవకాయలు, ఇతర వంటకాల్లో మంచి కలర్ వచ్చేందుకు బ్యాడిగ రకం మిర్చిని వినియోగిస్తారు. కారం తక్కువగా ఉంటుంది. అందువల్ల ఆయుర్వేద మందుల తయారీకి కూడా వినియోగిస్తారు. కర్నూలు మార్కెట్ యార్డులోనే గత ఏడాది మిర్చికి ఆశాజనకంగా ధరలు లభించడం విశేషం. గరిష్టంగా రూ.48,299 ధర లభించింది. జిల్లాలో గోనెగండ్ల, ఆలూరు, హాలహర్వి, మంత్రాలయం, కోసిగి, హొళగుంద, దేవనకొండ, పెద్దకడుబూరు, ఆస్పరి, ఎమ్మిగనూరు, నందవరం తదితర మండలాల్లో మిర్చి ఎక్కువగా సాగవుతోంది.

పెట్టుబడి ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షలు

మిర్చి సాగులో పెట్టుబడి ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు వస్తోంది. జిల్లాలో ఎక్కువగా బ్యాడిగ, సింజెంట, ఆర్మూర్, తేజ, సూపర్ డిలక్స్, దేవనూరు డిలక్స్ వంటి రకాలు సాగు చేస్తున్నారు. ఈ రకాలతో పండించిన మిర్చిలో నాణ్యత ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మంచి ధరలు లభిస్తున్నాయి. సగటున క్వింటాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు వస్తోంది. 2021-22తో పోలిస్తే 2022-23లో మిర్చిలో నల్ల తామర ప్రభావం అంతగా లేదు. ఉద్యాన శాఖ నల్ల తామర తెగులును నివారించుకునేందుకు పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్యం తీసుకొచ్చింది.

సూక్ష్మ సేద్యంతోనే మిర్చి సాగు

ఈ ఏడాది సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. 2022-23లో దాదాపు 12వేల ఎకరాలకు సూక్ష్మ సేద్య సదుపాయం కల్పించారు. అత్యధికంగా మిర్చికే డ్రిప్ సదుపాయం కల్పించడం విశేషం. 2023-24లో ఇప్పటికే 3,595 ఎకరాలకు సూక్ష్మ సేద్యం మంజూరు చేశారు. ఇందులో 60 శాతం మిర్చి పంటకే మంజూరు చేయడం విశేషం. సూక్ష్మసేద్య సదుపాయం వల్ల మిర్చిలో దిగుబడులు పెరిగాయి. దిగుబడులు కూడా నాణ్యతతో ఉండటం కలిసివచ్చే అంశం. నీటి సదుపాయంతో సాగు చేసిన మిర్చితో దిగుబడులు రికార్డు స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా మిర్చిని ఎక్కువగా గోదాముల్లో నిల్వ చేస్తారు. గత ఏడాది నుంచి ధరలు ఎక్కువగా ఉండటం వల్ల గోదాములకు మిర్చి వెళ్లడం బాగా తగ్గింది.

ఈ ఏడాది మిర్చి సాగు పెరిగే అవకాశం



గిట్టుబాటు ధర లభిస్తుండటం, దిగుబడులు మెరుగ్గా ఉండటంతో రైతులు మిర్చి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మిర్చిలో అధిక దిగుబడులు, తెగుళ్లను తట్టుకునే రకాలు అనేకం మార్కెట్‌లోకి వచ్చాయి. గత ఏడాది మిర్చి సాగు కలసి రావడంతో ప్రస్తుత సీజన్‌లో దాదాపు 1.50 లక్షల ఎకరాల వరకు సాగయ్యే అవకాశం ఉంది. – పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యానఅధికారి, కర్నూలు

ఎగుమతులు ఇలా..



- కర్నూలు జిల్లాలో పండించిన మిర్చి 80 శాతంపైగా గుంటూరు మిర్చి యార్డుకు వెళ్తుంది.
- అక్కడ జాతీయ స్థాయిలో వ్యాపారులు పోటీపడి కొనుగోళ్లు చేస్తారు.
- కొనుగోలు చేసిన మిర్చిని ముంబయి, కోల్‌కతా, బెంగళూరు, ఢిల్లీకి తరలిస్తారు.
- అక్కడ గ్రేడింగ్ చేసి నాణ్యమైన రకాలను విదేశాలకు ఎగుమతి చేస్తారు.
- మిర్చి సుగంధ ద్రవ్యాలకు చెందిన పంటగా గుర్తింపు పొందింది.
- గుంటూరులో స్పైసెస్ బోర్డు ఉంది. ఈ బోర్డు ద్వారా కూడా ఎగుమతులు జరుగుండటం విశేషం.
- కర్నూలు జిల్లాలో పండించిన బ్యాడిగ రకాలు, దేవనూరు డీలక్స్ రకాలకు చెందిన మిర్చి ఎగుమతి అవుతోంది.
- కనీసం రూ.50కోట్ల నుంచి రూ.100 కోట్ల విలువ చేసే మిర్చి విదేశాలకు ఎగుమతి అయినట్లు సమాచారం.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



లబ్ధిదారుకు యాజమాన్య ఆస్తి ధ్రువీకరణ హక్కు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు

ఆలూరు: పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంలో భాగంగా ఆలూరులో బుధవారం ఎ. గోనేహాళ్ గ్రామానికి చెందిన 137 మంది లబ్ధిదారులకు యాజమాన్య ఆస్తి ధ్రువీకరణ హక్కు పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతి ఒక్కరికీ మేలు చేయాలని దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించగా మంత్రి సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్ రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీడీఓ అల్లబకాష్, ఎంపీపీ రంగమ్మ, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15 వరకు 'నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం'

కర్నూలు(సెంట్రల్): ఆజాదీకి అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఆమె టెలీకాన్ఫరెన్స్ ద్వారా హౌసింగ్, ఉపాధి, నాడు-నేడు పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు ప్రతి గ్రామ పంచాయతీ, మునిసిపాలిటీలో, 16 నుంచి 20వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే ప్రతి పంచాయతీ పరిధిలో 75 మొక్కలు నాటాలని సూచించారు. జిల్లాలో అప్షన్-3 కింద ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. కంప్లీషన్ దశకు వచ్చిన ప్రాధాన్యత భవన నిర్మాణాలు 160 ఉన్నాయని, వాటిని వచ్చే సోమవారంలోపు పూర్తి చేయాలన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వ అండ

- వైఎస్ఆర్ కల్యాణమస్తు.. వైఎస్ఆర్ షాదీతోఫా కింద జిల్లాలో 1,076 జంటలకు రూ.8.61 కోట్ల జమ
- లబ్ధిదారులకు మెగా చెక్ అందజేసిన కలెక్టర్ సృజన



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): పేదింటి ఆడబిడ్డల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలుస్తోందని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలకు ఎంపికైన నూతన జంటల ఖాతాల్లో బటన్ నొక్కి నగదును జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కాకుడదన్నా ఉద్దేశంతో వైఎస్ఆర్ కల్యాణమస్తు...వైఎస్ఆర్ షాదీ తోఫా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు జిల్లాలో 1,076 జంటలకు రూ.8.61 కోట్లను జమ చేసినట్లు చెప్పారు. ఈ పథకాలు అందాలంటే వివాహం చేసుకునే ఆడపిల్ల వయస్సు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, కచ్చితంగా పదో తరగతి పాసై ఉండాలన్నారు. ఈ నిబంధనలతో బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు ఉన్నత విద్యకు నాంది పలికే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని మొత్తం 1,076 మంది లబ్ధిదారుల్లో బీసీలు 484, విభిన్న ప్రతిభావంతులు 8, మైనార్టీలు 209, ఎస్సీలు 359, ఎస్టీలు 16 మంది ఉన్నట్లు చెప్పారు. డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి మద్దయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా పథకాలతో పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక చేయూత ఇస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు రూ.8.61 కోట్ల మెగా చెక్కును కలెక్టర్ డాక్టర్ జి.సృజన, డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి మద్దయ్య, డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల అందజేశారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



మాది నిరుపేద కుటుంబం. మా నాన్న వ్యవసాయం చేసేవాడు. అనుకోకుండా ఆయన చనిపోవడంతో అమ్మే మాకు దిక్కైంది. వ్యవసాయం చేస్తున్నా అనుకున్న రీతిలో ఆదాయం రావడంలేదు. ఈ క్రమంలో నా పెళ్లి చేసేందుకు అమ్మ బయట అప్పు చేసింది. జగనన్న నా పెళ్లి కోసం రూ.50 వేలను అకౌంట్లో జమ చేయడం చాలా సంతోషం. జగనన్నకు రుణపడి ఉంటాం. – శ్రావణి, చోదిరెడ్డిపల్లె, కర్నూలు

మేలు మరువలేం



నాన్న ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అద్దె కంట్టేందుకు కూడా ఇబ్బందిగా ఉంటుంది. ఇటువంటి తరుణంలో వైఎస్ఆర్ షాదీ తోఫా పథకం మా కుటుంబానికి అండగా నిలిచింది. లక్ష రూపాయలు మా అమ్మ ఖాతాలో జమ చేస్తుండడం చాలా సంతోషంగా ఉంది. జగనన్న మేలును జీవితంలో మరచిపోలేం. – షేక్ సఫియా, కర్నూలు

కర్నూలుకు వచ్చిన వందేభారత్ రైలు

- కాచిగూడ నుంచి డోన్ వరకు ట్రయల్ రన్

కర్నూలు(రాజ్‌విహార్): భారత రైల్వే శాఖ రూపొందించిన వందే భారత్ రైలు బుధవారం కర్నూలుకు వచ్చింది. కాచిగూడ (హైదరాబాదు) నుంచి డోన్ వరకు నిర్వహించిన ట్రైల్ రన్‌లో భాగంగా బుధవారం మధ్యాహ్నం 1:35 గంటలకు కర్నూలు సిటీ స్టేషన్‌కు చేరుకుంది. ఇందులో వచ్చిన వివిధ విభాగాల అధికారులు ట్రాక్ స్పీడ్ టెస్టింగ్‌తో పాటు సిగ్నల్, టెక్నికల్, ఇతర అంశాలను పరిశీలించారు. త్వరలో కాచిగూడ నుంచి కర్నూలు మీదుగా బెంగళూరుకు ఈ రైలు నడిపేందుకు చర్యలు చేపట్టిన అధికారులు ముందస్తు సన్నాహకాల్లో భాగంగా ట్రయల్ రన్ నిర్వహించారు. భారతదేశంలో అత్యంత వేగంగా నడిచే రైళ్లలో వందే భారత్ రైలు ఒకటి. ఇది గంటలకు 160కిలోమీటర్ల వరకు వేగంతో నడుస్తుంది. ఈ రైలు రాక సందర్భంగా ప్రయాణికులు సెల్ఫీలతో సందడి చేశారు.



గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి

- గిరిజన భవన్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ సృజన, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్



గిరిజన భవన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్, చిత్రంలో కలెక్టర్ సృజన

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. నగర శివారుల్లోని గిరిజన భవన్‌లో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా రూ.1.35 కోట్లతో నిర్మించిన గిరిజన భవన్‌ను జిల్లా కలెక్టర్‌తో కలిసి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె. సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజనుల సంప్రదాయ కార్యక్రమాలు, వివాహాలు, ఇతర గిరిజన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సమావేశాలు నిర్వహించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గిరిజన భవన్‌ను నిర్మించిందన్నారు. గిరిజనుల విద్య, వైద్యం, సామాజిక అభివృద్ధి తదితర అంశాలకు ప్రభుత్వ యంత్రాంగం ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ, గురుకులాల్లో పిల్లలను చదివించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కోడుమూరు ఎమ్మెల్యే డా.జె సుధాకర్ మాట్లాడుతూ .. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఒక అబ్బాయిని దత్తత తీసుకొని మంచిగా చదివిస్తానన్నారు. గిరిజనుల వైద్య సేవలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో మూడు ఆశ్రమ, మూడు గురుకులాల్లో 585 మంది బాలురు, 756 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.24.80 లక్షలతో అంచనాలు రూపొందించామన్నారు. బీ క్యాంప్‌లోని బాలుర ఆశ్రమ పాఠశాలలో నాడు – నేడు పథకంలో భాగంగా రూ.42 లక్షలతో మరమ్మతులు చేసినట్లు చెప్పారు. ముద్దనగేరిలో గురుకుల పాఠశాల నిర్మాణం కోసం ప్రభుత్వం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, ఇక్కడ భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలను పంపాలని జిల్లా కలెక్టర్ ద్వారా కోరామన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందించారు. అలాగే విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సుధాకర్, పలువురు గిరిజన సంఘాలకు చెందిన నాయకులు నృత్యం చేశారు. కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, ఆయా గిరిజన కుల సంఘాల నాయకులు కైలాస్‌నాయక్, ఆర్ చంద్రప్ప, వైరాజు, యోగేష్‌నాయక్, రామచంద్రనాయక్, పీ వెంకటేష్, గుండాల్‌నాయక్, పలువురు డీవీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

వరికి గ్రామం యూనిట్‌గా బీమా

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి దిగుబడి ఆధారిత, వాతావరణ ఆధారిత బీమా అమలుకు పలు పంటలను ప్రభుత్వం నోటిఫై చేసింది. పంటలు ఈ-క్రాప్‌లో నమోదయితే చాలు వైఎసార్ ఉచిత బీమా వర్తిస్తుంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దిగుబడి ఆధారితంగా గ్రామం యూనిట్‌గా వరికి బీమా సదుపాయం కల్పించనున్నారు. వాతావరణ ఆధారిత బీమా కింద కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వేరుశనగ, వర్షాధారం కింద పత్తి పంటలకు బీమా సదుపాయం లభించనుందని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. నోటిఫై చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదు చేసిన తర్వాత రైతులు ఈ-కేవైసీ చేస్తే ఉచితంగా బీమా అమలవుతుందన్నారు. పూర్తి వివరాలు త్వరలోనే ప్రభుత్వం విడుదల చేయనుందని డీఏఓ తెలిపారు.

దిగుబడి ఆధారిత బీమా

మండలం యూనిట్‌గా:

- కర్నూలు జిల్లాలో మొక్కజొన్న, కంది, ఎండుమిర్చి, జొన్న, ఆముదం..
- నంద్యాల జిల్లాలో మొక్కజొన్న, కంది, మినుము, ఎండుమిర్చి

జిల్లా యూనిట్‌గా:

- కర్నూలు జిల్లాలో సజ్జ, కొర్ర, ఉల్లి,
- నంద్యాల జిల్లాలో జొన్న, సజ్జ, కొర్ర, ఉల్లి

63 పంచాయతీల్లో అమృత్ మహోత్సవాలు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కర్నూలు(అగ్రికల్చర్): దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవాలను బుధవారం 63 గ్రామ పంచాయతీల్లో నిర్వహించా. ఇందులో భాగంగా నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్తులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓర్వకల్లు, నన్నూరు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తి అయిన నేపథ్యంలో ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటుతున్నామన్నారు. బుధవారం 63 పంచాయతీల్లో శిలాఫలకం ఆవిష్కరణ, మొక్కలు నాటడం, వీరులకు వందనం, వసుధకు వందనం, హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ నెల 15 వరకు ఈ కార్యక్రమాలను జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. అదనపు పీడీ సలీమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

'నులి'పేద్దాం!

- నేడు, 17న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ అందజేత
- ఇప్పటికే అన్ని విద్యాకేంద్రాలకు మాత్రల చేరవేత
- నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్)/నంద్యాల టౌన్: వ్యక్తిగత పరిశుభ్రతపై చిన్నారులకు అవగాహన ఉండదు. అపరిశుభ్ర చేతులతో ఆహారం తీసుకోవడంతో క్రిములు కడుపులోకి వెళ్లి వ్యాధులను కలుగజేస్తున్నాయి. కడుపులో చేరిన పురుగులను నిర్మూలించేందుకు ప్రతి సంవత్సరం రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు అందజేస్తోంది. ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల్లో 19 ఏళ్ల లోపు వయసున్నవారు 4,06,219 మంది ఉన్నారు. అలాగే కర్నూలు జిల్లాలో 6,08,249 మంది విద్యార్థులు ఉన్నారు. కర్నూలు జిల్లాలో 1,886 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,10,662 మంది, 1,503 ప్రభుత్వ/ఎయిడెడ్ స్కూళ్లలో 2,86,117 మంది, 740 ప్రైవేటు పాఠశాలల్లో 1,53,781 మంది విద్యార్థులకు మాత్రలు అందజేయనున్నారు. అలాగే 78 ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో 16,835 మంది, 69 ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 26,818 మంది, 15 వొకేషనల్ కాలేజీల్లో 2,057 మంది, 24 ఐటీఐ/పాలిటెక్నికల్ కాలేజీల్లో 1,838 మంది, 11 నర్సింగ్ కాలేజీల్లో 590 మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించారు. వీరితోపాటు 12 చైల్డ్‌కేర్ సెంటర్స్/షెల్టర్ హోమ్స్/జువైనల్ హోమ్స్‌లలో 121 మంది, బడిబయట ఉన్న 4,731 మంది, అంగన్‌వాడీ స్కూళ్లకు వెళ్లని పిల్లలు 4,699 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి ఈ నెల 10వ తేదీన నులిపురుగుల నివారణ మాత్రలు(ఆల్బెండజోల్ మాత్రలు) వేయనున్నారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, ఆపై వయస్సున్న పిల్లలకు ఒక మాత్ర వేసేందుకు వాటిని ఆయా విద్యాకేంద్రాలకు చేర్చారు.

నులిపురుగులు వ్యాపించే విధానం

- నులిపురుగులు ఉన్న వ్యక్తి చేసిన మల విసర్జన ద్వారా అందులోని గుడ్లు నేలలోకి, తద్వారా తాగునీరు, గాలి ద్వారా ఆహార పదార్థాలపై చేరతాయి.

వ్యాధి లక్షణాలు

రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం–ఆందోళన, కడుపునొప్పి–వికారం, వాంతులు–విరేచనాలు, బరువు తగ్గడం, తరచుగా ఇన్‌ఫెక్షన్లకు గురికావడం.

నులిపురుగుల నిర్మూలనతో ప్రయోజనాలు

రక్తహీనతను నివారిస్తుంది. పోషకాలను శరీరం గ్రహించుకుంటుంది. చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది. అంగన్‌వాడీ/పాఠశాల/కళాశాలకు వెళ్లేందుకు ఆసక్తి కలుగుతుంది. పనిచేయగల సామర్థ్యం పెరుగుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గోళ్లను చిన్నవిగా, శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఎప్పుడూ శుభ్రమైన నీటిని తాగాలి.
- ఆహారాన్ని ఎప్పుడూ కప్పి ఉంచాలి.
- కూరగాయలు, పళ్లను శుభ్రమైన నీటితో కడగాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- బయట తిరిగేటప్పుడు బూట్లు/చెప్పులు ధరించాలి.
- బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయకూడదు. ఎప్పుడూ మరుగుదొడ్డినే వాడాలి.
- ఏదైనా తినకముందు, తిన్న తర్వాత, మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.

విజయవంతం చేద్దాం

అన్ని శాఖల సమన్వయంతో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10న, 17న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు విద్య, ఎస్ఎస్ఏ, ఐసీడీఎస్, అనియత విద్య, వికలాంగుల సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, సాంఘిక సంక్షేమ శాఖ, మున్సిపల్ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 10న మాత్రలు అందని పిల్లలు 17వ తేదీన తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత, మలేరియా అధికారి నూకరాజు, ఎస్‌వో హేమసుందరం, డెమో ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు.



నులిపురుగుల నివారణ కార్యక్రమం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత, ఇతర అధికారులు

నిర్లక్ష్యం వద్దు



నులిపురుగుల నివారణ మాత్రలు మింగించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు. విధిగా వైద్య బృందం, పాఠశాల బృందం మాత్రలు పంపిణీ చేయాలి. భోజనం తర్వాత దగ్గరుండి మింగించాలి. పిల్లలకు ఆరోగ్య సమస్యలుంటే ముందుగానే గుర్తించి.. డాక్టర్ల సలహాలు తీసుకోవాలి. అలాంటి పిల్లలకు ఆ తర్వాత మాత్రలు ఇవ్వాలి. అన్ని పాఠశాలలకు ఈ మాత్రలు ఇప్పటికే సరఫరా చేశాం. కచ్చితంగా ప్రతి పిల్లవాడు ఈ మాత్ర వేసుకోవాలి. నులి పురుగుల నివారణకు తల్లిదండ్రులు సహకరించాలి.

–డాక్టర్ వెంకటరమణ, నంద్యాల జిల్లా వైద్యాధికారి

రాయితీపై గడ్డి కోత యంత్రాలు

నంద్యాల(సెంట్రల్): పశుపోషకులకు రాయితీ ధరలపై గడ్డి కత్తిరింపు యంత్రాలు(చాప్‌కట్టర్లు) పంపిణీ చేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో 40 మందికి వాటిని పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు 11 మంది దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన కింద పంపిణీ చేసే ఈ చాప్‌కట్టర్లకు ప్రభుత్వం రూ.13,588 రాయితీ ఇస్తోందన్నారు. రైతులు రూ.20,382 చెల్లిస్తే చాలన్నారు.

సూక్ష్మ సేద్యంతో వ్యవసాయంలో రాణింపు



సూక్ష్మ సేద్యం పరికరాల వాహనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): సూక్ష్మ సేద్యంతో రైతులు వివిధ పంటల సాగులో రాణిస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఉద్యాన భవన్‌లో బిందు, తుంపర్ల సేద్య పద్ధతులపై అవగాహన, సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్లూరు, కర్నూలు మండలాలకు చెందిన పలువురు రైతులకు రూ.8 లక్షల విలువైన డ్రిప్ పరికరాలు, పైపులు, ఇతర మెటీరియల్‌ను ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవితో కలసి పంపిణీ చేశారు. పలువురు రైతులకు సూక్ష్మ సేద్యం మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఏడాది ముందస్తుగా సూక్ష్మ సేద్యం అమలుకు లక్ష్యాలు ఇవ్వడంతో పాటు నిధులు కూడా విడుదల చేసిందన్నారు. 2023–24లో 5వేల హెక్టార్లకు సూక్ష్మసేద్యం కల్పించాలనేది లక్ష్యం కాగా ఇప్పటికే 1500 హెక్టార్లకు మంజూరు చేయడం, 795 హెక్టార్లకు మెటీరియల్ ఇవ్వడం పూర్తయిందన్నారు. ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి మాట్లాడుతూ సూక్ష్మ సేద్యం కోసం 10వేల మందికి పైగా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇందులో ఎవరికి అత్యవసరమో గుర్తించి వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

త్వరలో ముచ్చుమర్రి నుంచి కేసీకి నీటి విడుదల

పగిడ్యాల: త్వరలో ముచ్చుమర్రి ఎత్తిపోతల కేసీసీ లిఫ్ట్ ద్వారా కృష్ణా జలాలను కేసీ కాలువకు విడుదల చేయనున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పాత ముచ్చుమర్రి, పగిడ్యాల గ్రామాల వద్ద కేసీ కాలువపై నిర్మిస్తున్న నూతన బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధారణ నిధుల నుంచి రూ. 3.40 కోట్ల వ్యయంతో రెండు లైన్‌ల బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. కేసీ ఆయకట్టు రైతాంగం నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారని, అయితే, సుంకేసుల నుంచి కెనాల్‌కు నీటి విడుదల చేసేందుకు అవకాశం లేదన్నారు. ప్రస్తుతం సుంకేసుల రిజర్వాయర్‌లో 1 టీఎంసీ నీరు మాత్రమే నిల్వ ఉందని తెలిపారు. ఆ నీటిని కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం నిల్వ ఉంచామన్నారు. కెనాల్‌కు ప్రత్యామ్నాయంగా ముచ్చుమర్రి కేసీసీ లిఫ్ట్ ద్వారా 1000 క్యూసెక్కుల నీరు విడుదల చేసేందుకు ప్రభుత్వ అనుమతి కోరామని తెలిపారు. కాగా కేసీలో గుట్టలు గుట్టలుగా చెతాచెదారం పడి ఉండటంతో కాలువను డస్ట్ బిన్ అనుకున్నారా అంటూ పంచాయతీ కార్యదర్శి జావేద్‌పై నీటిపారుదల శాఖ డీఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలని హెచ్చరించారు.

శ్రీశైలంలో రెండో రోజూ ఏసీబీ తనిఖీలు



ఔటర్‌రింగ్ రోడ్డులో శాంపిల్స్ సేకరిస్తున్న దృశ్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో పరిధిలో చేపట్టిన పలు ఇంజినీరింగ్ పనులను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెండో రోజు తనిఖీ చేశారు. బుధవారం ఏసీబీ సీఐ వంశీనాథ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లు రామకృష్ణ, సహాయ ఇంజనీర్లు, టెస్టింగ్ బృందం ఔటర్‌రింగ్ రోడ్డు, పుష్కరిణి, ఫిల్టర్‌బెడ్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శాంపిల్స్ సేకరించారు. గురువారం కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టనున్నారు. ఏసీబీ సీఐ వంశీనాథ్ మాట్లాడుతూ ఏసీబీకి అందిన ఫిర్యాదు మేరకు ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి విచారణ నిమిత్తం శ్రీశైలం వచ్చామన్నారు. ల్యాబ్‌లో నాణ్యతతో పాటు పనులు చేసేటప్పుడు టెండర్‌లో ఉన్న నిబంధనల మేరకు మెటీరియల్ వినియోగించారా లేదా అనే విషయాలను పరిశీలిస్తామన్నారు.

మూడు మట్టి లారీల పట్టివేత



తమ్మరాజుపల్లెలో మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీడీ రాజశేఖర్

కర్నూలు (న్యూసిటీ): కల్లూరు మండలం తడకనపల్లెలో అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు లారీలను పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. లారీల యజమానుల్లో ఇద్దరు కర్నూలు చెందిన మనోహర్, చాంద్‌బాషా, మరొకరు తాండ్రపాడుకు చెందిన వెంకటేశ్వర్లుగా గుర్తించినట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేస్తామని చెప్పారు. లారీలను ఉల్లిదండకొండ పోలీసుస్టేషన్‌లో అప్పగించామని, ఒక్కో లారీకి రూ. 33,300 అపరాధ రుసుం విధించామన్నారు.

నాలుగు జేసీబీలు స్వాధీనం

ఓర్వకల్లు మండలం తమ్మరాజుపల్లెలో లైసెన్స్ లేకుండా నాలుగు జేసీబీలతో అక్రమంగా మట్టి తవ్వుతున్నారనే సమాచారం రావడంతో వెళ్లి తనిఖీ చేశామని, జేసీబీలను స్వాధీనం చేసుకున్నామని డీడీ రాజశేఖర్ తెలిపారు. జేసీబీ యజమానులు తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన రామకృష్ణ, శంకర్, సురేంద్ర, నంద్యాల జిల్లాకు చెందిన సుధాకర్‌రెడ్డికి ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున అపరాధ రుసుం విధించి, కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ బాలు నాయక్ తదితరులు ఉన్నారు.

కర్నూలు-మచిలీపట్నం రైలు నడపాలి

- రైల్వే బోర్డు చైర్మన్‌కు కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ వినతి

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నుంచి మచిలీపట్నం వరకు రోజువారీగా రైలును నడపాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ రైల్వే ఉన్నతాధికారులను కోరారు. బుధవారం రైల్వే బోర్డు చైర్మన్, సీఈఓ అనిల్‌కుమార్ లాహోటిని ఢిల్లీలోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గుంటూరు, విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకు నడిచిన ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును జూలై 1వ తేదీ నుంచి నుంచి నిలిపివేశారని బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం అయిన విషయం తెలిసిందే. దీనిపై ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ స్పందించి రైల్వే ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రైలును ప్రత్యేక/తత్కాల్ పేరుతో కాకుండా రోజువారీగా నడపాలని కోరారు. ఎంపీ వినతికి రైల్వే బోర్డు చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

బాధ్యతాయుతంగా పనిచేయండి

- ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు
- ఫుడ్ కమిషన్ చైర్మన్ సి. విజయప్రతాప్‌రెడ్డి



వంటగదిని పరిశీలిస్తున్న ఫుడ్‌కమిషన్ చైర్మన్ సి. విజయప్రతాప్‌రెడ్డి

ఆదోని సెంట్రల్/ఆదోని రూరల్: పద్ధతులు మార్చుకొని బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ సి. విజయ ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఆదోని పట్టణం ఎస్‌కేడీ కాలనీలో ఉన్న రేషన్ డీలర్ దుకాణాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం బండిమెట్ట ప్రాంతంలో అంగనవాడీ కేంద్రానికి వెళ్లి అక్కడ రికార్డులను పరిశీలించారు. గుడ్లు, టేక్ హోం రైస్ కిట్లు పంపిణీ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాకు వచ్చినట్లు, పంపిణీ చేసినట్లు రికార్డులో నమోదు చేయకపోవడంపై మండిపడ్డారు. అనంతరం అరెకల్లు బీసీ బాలికల జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో వంటగదిని పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై పోర్టిఫైడ్ రైస్ ఉపయోగాలను గురించి వివరించారు. మెను ప్రకారం భోజనాలు అందుతున్నాయో లేదా అరా తీశారు. విద్యార్థులపై సిబ్బంది చూపుతున్న శ్రద్ధపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విరుపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని రుచి చూసి, వంటవాళ్లపై అగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులు సమయం ఇస్తున్నానని, భోజనం రుచికరంగా చేయకపోతే వంట ఏజెన్సీని మార్చాల్సిందిగా మండల విద్యాధికారికి సూచించారు. ఈయన వెంట డీఈఓ రంగారెడ్డి, మండల విద్యాధికారి–2 శ్రీనివాసులు, సీఎస్‌డీటీ వలిబాషా, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగనవాడీ సిబ్బంది ఉన్నారు.

పెద్దాసుపత్రిలో అదనపు ఓపీ కౌంటర్లు ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బుధవారం అదనంగా మరో రెండు ఓపీ కౌంటర్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో రెండు ఓపీ కౌంటర్లు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి రోగికి సంబంధించిన ఆరోగ్య సమాచారం ఆన్‌లైన్‌లో నమోదవుతుందన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి అభా యాప్ ఐడీ నెంబర్ ద్వారా సులభంగా డిజిటల్ హెల్త్ ఐడీ నెంబర్ చెబితే ఓపీ, ఐపీ ప్రాసెస్ త్వరగా పూర్తవుతుందన్నారు. ఆసుపత్రికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, అభా ఐడీ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో చోరీ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని హనీఫ్‌నగర్ వీధిలో ఉన్న ఆరెంజ్ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం భారీ చోరీ జరిగింది. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన శ్రీధర్ స్థానిక ఆరెంజ్ అపార్ట్‌మెంట్‌లోని 5 వ ఫ్లోర్‌లో నివాసముంటున్నాడు. శ్రీధర్ స్థానిక ఆర్‌జీఎం కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య దీప్తి ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుంది. వీరికి ఇద్దరు సంతానం. మంగళవారం వారు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 28 తులాల బంగారు ఆభరణాలు, అరకేజీ వెండి, రూ.20 వేల నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.